# పరీక్షలకు వేళాయే..

## నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

**ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు ఎగ్జామ్**

**విద్యార్థులు గంటముందే పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలి**

**గ్రేటర్ వ్యాప్తంగా 576 సెంటర్ల ఏర్పాటు**

**పరీక్ష రాయనున్న 4,58,839 మంది విద్యార్థులు**

**పర్యవేక్షణకోసం ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: గ్రేటర్ వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సుమారు 4,54,893మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం ఇంటర్మీడియట్ బోర్డు గేటర్‌పరిధిలోని మూడు జిల్లాలో 576 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతిపరీక్షా కేంద్రానికి ఒక ఛీప్ సూపరింటెండెంట్ అధికారిని పర్యవేక్షణ కోసం సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. అలాగే విద్యార్థులకు వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈహాల్‌టికెట్ల కొరకు మొదటి సంవత్సరం విద్యార్థులైతే ఎస్ఎస్‌సి హాల్‌టికెట్‌తోపాటు పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలని, అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నెంబర్‌తో పాటు పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలన్నారు.

**576 కేంద్రాలు ..4,54,893 మంది విద్యార్థులు**

హైదరాబాద్ జిల్లా పరిధిలో మొదటి సంవత్సరం పరీక్షలకు 80,583 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 93,784 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో కోసం 242 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకోసం 4ఫ్లయింగ్, సిట్టింగ్ బృందాలను నియమించారు. రంగారెడ్డి జిల్లాలో 74,875 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలకు, 74,191మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం 195 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**గంట ముందే చేరుకోవాలి**

పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు పరీక్ష సమయం కంటే గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని బోర్డు అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8.30తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సులువుగా చేరుకునేందుకు ఇంటర్మీడియట్ బోర్డు సెంటర్‌లొకేట్ యాప్ అవకాశం కల్పించింది. అలాగే పరీక్ష కేంద్రాలల్లో సెల్‌ఫోన్లు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌ను అనుమతించరు.

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో ప్రథమ సంవత్సర పరీక్షలకు 65,965, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 65,495మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇక్కడ పరీక్షల నిర్వాహణకు 139 సెంటర్లను ఏర్పాటు చేశారు.

పాదయాత్రతో చట్టసభల్లో బిసిల వాటా సాధించాలి
రౌండ్‌టేబుల్ సమావేశంలో సామాజిక, ప్రజాసంఘాల పిలుపు
రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే సోలార్ వినియోగం పెరుగుతుంది
కోకాపేట్‌లో ఘనంగా జరిగిన సౌడమ్మ బోనాల వేడుకలు
గ్రామదేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలలో భాగం : ఎమ్మెల్యేవివేకానంద
2, 3లో



# హైదరాబాద్ వార్త

## కాంగ్రెస్ దొంగ మాటలు నమ్మి..

# కెసిఆర్‌ను దూరం చేసుకున్నారు

## కాంగ్రెస్‌వి చార్‌సౌ బీస్ హామీలు: కెటిఆర్

**అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అందరికీ అన్నీ ఫ్రీ అన్నదని, ఇప్పుడు కొత్త సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదని, చార్‌సౌ బీస్ హామీలని, వాటిని అమలు చేసేదాకా నిలదీస్తాం.. పార్లమెంటు ఎన్నికల్లో కారు జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తుందని మాజీ మంత్రి కెటిఆర్ అన్నారు. 15 ఏళ్లు ఉద్యమ కాలంలో 10 ఏళ్లు తెలంగాణ అభివృద్ధిలో వంద స్పీడ్‌తో కారు దూసుకెళ్లిందని, అయితే కారు సర్వీసింగ్ అనంతరం వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దూసుకెళ్లేందుకు కారు సిద్ధంగా ఉందని కెటిఆర్ అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.**



అంబర్‌పేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పక్కన స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : కాంగ్రెస్ దొంగ మాటలు నమ్మి కెసిఆర్‌ను దూరం చేసుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదన్న కెసిఆర్ మాటలను కాంగ్రెస్ నిజం చేస్తోందన్నారు. మంగళవారం అంబర్‌పేట మహారాణా ప్రతాప్‌ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షతన నియోజకవర్గం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు పెట్టిన వంద రోజుల గడువు మార్చి 9 కూడా దగ్గర పడుతున్నదని, హామీల అమలు గురించి అడిగితే ప్రభుత్వంలో ఉన్నవాళ్లకు రోషం పొడుచుకొస్తున్నదని, అడ్డం పొడుగు మాట్లాడుతున్నారని తెలిపారు. 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ అన్నారు, రూ.500లకే గ్యాస్ అన్నారు. ఇప్పుడు వాటిని ఇవ్వకుండా కొత్తకొత్త నిబంధనలతో వాటిని దూరం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అందరికీ అన్నీ ఫ్రీ అన్నదని, ఇప్పుడు కొత్త సన్నాయి నొక్కులు నొక్కుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదని, చార్‌సౌ బీస్ హామీలన్నారు. వాటిని అమలు చేసేదాకా నిలదీస్తామని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కారు జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తుందని వరాజీ మంత్రి కెటిఆర్ అన్నారు. 15 ఏళ్ల ఉద్యమ కాలంలో 10 ఏళ్ల తెలంగాణ అభివృద్ధిలో వంద స్పీడ్‌తో కారు దూసుకెళ్లిందని, అయితే కారు సర్వీసింగ్ అనంతరం వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దూసుకెళ్లేందుకు కారు సిద్ధంగా ఉందన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి ప్రాతినిధ్యం వహించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తన నియోజకవర్గ అభివృద్ధికి పైసా ఖర్చు చేయలేదని అన్నారు. మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయ లబ్ధి పొందడం బిజెపికే చెల్లిందన్నారు. తెలంగాణ కోసం కొట్లాడేది, పార్లమెంటులో గళం విప్పేది బిఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్, బిజెపికి లేవు, ఆ రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు ద్రోహం చేశాయి. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం, నాయకులు, కార్యకర్తలు కుంగిపోవద్దన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా గ్రేటర్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, అరెకపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట్ రాంరెడ్డి, బిఆర్ఎస్ నేతలు తలసాని సాయికిరణ్‌యాదవ్, రావుల శ్రీధర్‌రెడ్డి, ఎడ్ల సుధాకర్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, పద్మ వెంకట్‌రెడ్డి, కె.పద్మావతి దుర్గాప్రసాద్‌రెడ్డి, వనం రమేష్, ఎర్రబోలు నర్సింహారెడ్డి, లింగంగౌడ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

**కెటిఆర్‌కు నిరసన సెగ..**
**కారును అడ్డుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు**

మాజీ మంత్రి కెటిఆర్‌కు నిరసన సెగ తగిలింది. అంబర్‌పేటలో ఆయన కారును యూత్ కాంగ్రెస్ నాయకులు మోతె రోహిత్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఖబడ్దార్..నిన్ను తిరగనివ్వం.. గోబ్యాక్ కెటిఆర్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్టుచేసి అంబర్‌పేట పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మోతె రోహిత్ మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఊసెత్తని కెటిఆర్.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేయడం తగదన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాల సమస్యపై సిఎంతో చర్చిస్తా

**తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం**





ప్రసంగిస్తున్న తెలంగాణ జనసమితి అధినేత కోదండరామ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: వివిధ మీడియాలలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళే విషయంలో జర్నలిస్టులతో కలిసి వస్తానని తెలంగాణ జనసమితి అధినేత కోదండరామ్ హామీ ఇచ్చారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ జర్నలీస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చే అంశంపై గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల విషయంలో కొంత సానుకూల దోరణిలో ఉందని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకెళ్ళడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉందని, ముఖ్యంగా చిరకాల వాంఛ అయిన ప్రత్యేక తెలంగాణ సాధనలో కూడా జర్నలీస్టుల పాత్ర ఉందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఒకటి రెండు చోట్ల జర్నలీస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయించి, తిరిగి తీసుకున్న సంఘటనలున్నాయన్నారు. సమావేశంలో తెలంగాణ జనసమితి నగర అధ్యక్షుడు నర్సయ్య, సొసైటీ ప్రధాన కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, కోశాధికారి పిల్లి రాంచందర్, కార్యవర్గసభ్యులు యర్రమిల్లి రామారావు, భాస్కరరెడ్డి, వీరేశం, సీనియర్ పాత్రికేయులు పులిపలుపుల ఆనంద్, షోయబుల్లాఖాన్, బిఆర్‌కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

**విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యార్థులకు సూచించారు. మంగళవారం షేక్‌పేట్ మండలం బోరబండ పెద్దమ్మనగర్‌లోని నాట్కో ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకటవ తరగతి క్లాస్‌రూమ్‌లో విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదిలో పిల్లలతో మాట్లాడుతూ ఏం రాస్తున్నారు.. ఎలా చదువుతున్నారు. బ్లాక్‌బోర్డుపై అంకెను చూపిస్తూ ఈఅంకె ఎంత అంకెల కూడిక చేసి చూపెట్టమని మ్యాథ్స్ అడిగి తెలుసుకున్నారు. బాగా చెప్పిన విద్యార్థులకు చాకెట్లు అందించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు మెరుగైన భోజనం మెనూ ప్రకారం అందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. తదుపరి పదవ తరగతి క్లాస్‌రూమ్‌ను సందర్శించి విద్యార్థులతో పదవ తరగతి పరీక్షల్లో ప్రిపేర్ అవుతున్నారా.. ఉపాధ్యాయులు సరిగ్గా బోధిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 18నుంచి ఏప్రిల్ 2వరకు జరగనున్న పదవతరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు విద్యార్థులు పరీక్షల గురించి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా కాన్ఫిడెంట్స్‌తో రాయాలన్నారు. పదవతరగతి విద్యార్థులకోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్వాన్‌లో బిజెపి విజయ సంకల్ప యాత్ర



బోనాలతో స్వాగతం పలికిన మహిళలు, విజయ సంకల్పయాత్రలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మెహిదీపట్నం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి ఏర్పడాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మంగళవారం హైదరాబాద్ పార్లమెంట్ భాగ్యలక్ష్మి క్లస్టర్ నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల్లో కొనసాగింది. ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అంటూ బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ యాత్రలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో కొనసాగిన యాత్రకు కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై గుడిమల్కాపూర్‌లోని జైన్‌మందిర్, కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివేకానంద చౌరస్తా నుంచి ప్రారంభమైన యాత్రలో కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లకు మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. కళాకారులు నృత్యాలతో అలరించగా, యువకులు భారీ బైక్ ర్యాలీతో వెంటసాగారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్ నాయకులు పాండు యాదవ్, డిజ్వర్‌సింగ్, ఇంద్రసేనారెడ్డి, బండారి రాధిక, ఆకుల గోవర్ధన్, వి. భుజేందర్‌కుమార్, యోగిరాజ్ సింగ్, దేవర వంశీ, గంగాధర్, అన్నూ యాదవ్, వై.అనీల్‌చారి, పూర్ణచందర్, సునీల్ యాదవ్, సుధాకర్ యాదవ్, ముఖేష్‌సాగర్, అనీల్ కార్యకర్తలు, యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**భూకబ్జాలపై కేంద్రమంత్రికి ఫిర్యాదు..** విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డికి ఆసీఫ్‌నగర్ మండల పరిధిలో కొనసాగుతున్న భూకబ్జాలపై బిజెపి కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు గురజాల శివరాజ్ యాదవ్ ఫిర్యాదు చేశారు.



యూనియన్ రూపొందించిన డైరీ ఆవిష్కరిస్తున్న కూనంనేని సాంబశివరావు

# ఉద్యోగులు రోగులకు మానవతా దృక్పథంతో సేవలందించాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: మెడికల్ ఉద్యోగులు రోగులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలని ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. రోగులకు సేవలు అందించడంలో ఎంతో తృప్తి నిస్తుందని చెప్పారు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీ-2024ను మంగళవారం ఏఐటియుసి భవన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆనాలోచిత నిర్ణయాలను తీసుకుని ఉద్యోగులపై ఉక్కుపాదం మోపి తీవ్రమైన ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృత నిశ్చయంతో ఉందన్నారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.వేణుకుమార్, శాంతకుమార్, కె.శ్రీనివాస్‌చారి, వీరేశం బాబు, ఆరోగ్యమ్మ, నర్సయ్య, యాదయ్య పాల్గొన్నారు.



కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, బండ్లగూడ బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పోరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు పాపయ్య యాదవ్, పాండు, రవీందర్‌రెడ్డి తదితరులు

# అనారోగ్యంతో సంఘ సేవకులు మృతి



మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పుచ్చ శ్రీరామమూర్తి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో నివసిస్తున్న ప్రముఖ సంఘ సేవకులు, మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సీనియర్ మెంబర్ పుచ్చ శ్రీరామమూర్తి(85) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మంగళవారం మృతిచెందారు. ఆయన మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో సీనియర్ మెంబర్‌గా, కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇతనికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన కమిటి సభ్యులు స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు పలువురు ఆయన పార్థీవ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# జలమండలి ఎండిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



ఎండీ సుదర్శన్‌రెడ్డికి నియోజక వర్గం సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పోరేటర్ పన్నాల, శాయిజన్ శేఖర్

నాచారం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ఉప్పల్ నియోజక వర్గంలో నెలకొన్న మంచినీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాచారం బిఆర్ఎస్ నాయకులు శాయిజన్ శేఖర్ తధితరులు ఖైరతాబాద్‌లోని జలమండలి ఎండీని కలిశారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి డివిజన్‌లో టీని సమస్య రాకుండా చూడాలని వారు ఎండిని కోరారు. ప్రతి డివిజన్‌కు రూ. కోటి రూపాయలు మంజూరు చేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా చూడాలని వారు కోరారు. అందుకు సానుకూలంగా స్పందించారని వారు చెప్పారు.

# రాష్ట్రపతి నిలయంలో అలరిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్



రాకెట్ నమూనాలు పరిశీలిస్తున్న విద్యార్థులు

అల్వాల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రెండవ రోజు సైన్స్ ఎగ్జిబిషన్ సందడిగా సాగింది. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 2వేలు మంది విద్యార్థులు మంగళవారం ప్రదర్శనను తిలకించారు. సోమవారం ప్రారంభమైన ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు నుంచి మంచి స్పందన కనిపిస్తోంది. రాష్ట్రపతి నిలయం సందర్శనతో పాటుగా ఎగ్జిబిషన్‌ను చూసే అవకాశం ఉండడంతో పాఠశాలల యజమాన్యాలు విద్యార్థులను తీసుకుని వస్తున్నాయి.



సంకల్ప యాత్రలో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

# చార్మినార్ నియోజకవర్గంలో విజయ సంకల్ప యాత్ర

చార్మినార్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గంలో మంగళవారం రాత్రి జరిగిన విజయ్ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెప ప్రభుత్వం హయాంలోనే దేశం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి సాధించిందని తెలిపారు. చార్మినార్ నియోజకవర్గం పరిధిలోని నయాపూల్, మదీనా, సిటీ కళాశాల రహదారి, పురానాపూల్ దర్వాజ, పురానాపూల్ పార్థివాడతో పాటు పలు ప్రాంతాలలో విజయ్ సంకల్ప యాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎమ్మెల్యే మహేందర్ రెడ్డి గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు పాండుయాదవ్, ప్రధాన కార్యదర్శి ఉమామహేంద్ర, చార్మినార్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ సురేందర్, సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ద్విచక్రవాహన దొంగలను అరెస్ట్ చేసిన సుల్తాన్‌బజార్ పోలీసులు



అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 27ప్రభాతవార్త: ద్విచక్రవాహనాలను దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు దొంగలను సుల్తాన్‌బజార్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డిసిపి రావుల గిరిధర్ కథనం ప్రకారం... సుల్తాన్‌బజార్ పోలీసులు కాచిగూడ చౌరాస్తా వద్ద తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. గుంజి రామాంజనేయులు ద్విచక్రవాహనంపై వస్తుండగా పోలీసులు అనుమానంతో నిలిపి వాహనానికి సంబంధించిన పత్రాలను చూపించాలన్నారు. దీంతో అంజనేయులు తడబడంతో అదుపులోకి తీసుకుని విచారించగా పలుచోట్ల వాహనాలను తస్కరిస్తున్నట్లు చెప్పారు.

# ప్రయోగాత్మక విద్యతోనే ఉత్తమ ఫలితాలు

**కుత్బుల్లాపూర్ ఎంఇఓ ఆంజనేయులు**



**స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ లో విద్యార్థులను వివిధ అంశాలను పరిశీలిస్తున్న కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి ఆంజనేయులు,పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు, ట్రెస్మా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కె.రామేశ్వర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ బి.శోభారాణి తదితరులు**

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : ప్రయోగాత్మక విద్యాభివృద్ధితోనే దేశం అన్ని రంగాలలో పురోగతి సాధిస్తుం దని కుత్బుల్లాపూర్ మండల విద్యాధి కారి పి.ఆంజనేయులు అన్నారు. మగ్దూంనగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠ శాలలో విద్యార్థులు అభ్య సించిన పాఠ్యాంశాల పాఠ్యాంశాల కార్యక్రమం స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ను ఉద్దేశించి జరిగిన సమావేశంలో ప్రసంగిం చారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యదశ నుండే వివిధ అంశాలలో పరిశోధానత్మకతను పెంపొందించేం దుకు ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధవహించా లన్నారు. మేడ్చెల్ మల్కాజిగిరి ట్రెస్మా అధ్యక్షులు కె.రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంయుక్తంగా కృషిచేయడంద్వారా ఉత్తమ ఫలితాల సాధన సాధ్యమన్నారు. శ్రీసాయి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో సమర్థంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రైవేట్‌స్కూల్ కరస్పాండెంట్లు గడ్డమీది బాల్‌రాజ్, జి.ప్రవీణ్‌రెడ్డి, వినోద్‌జాదవ్, సోనీకృష్ణ, సయ్యద్ ఇమ్రాన్, మధు తదితరులుపాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ బిర్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే సోలార్ వినియోగం పెరుగుతుంది

**తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు బి.అశోక్‌కుమార్‌గౌడ్**



**సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్‌గౌడ్, శ్రీహరిబాబు, రాజేష్ తదితరులు**

హైదరాబాద్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన పిఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకాన్నికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇస్తే సోలార్ విద్యుత్ గణనీయంగా పెరగుతుందని తద్వారా రాష్ట్రంలోని లక్షలాదిమంది వినియోగదారులకు మేలు జరుగుతుందని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు బి.అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో పిఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం అమలుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిదిన సోలార్ యూనిట్ల ఏర్పాటు కాంట్రాక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పిఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం అశోక్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పునరుత్పాదక ఇందన వనరుల ఉత్పత్తిని పెంచేందుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని విస్తృతంగా చేయాల్సిన అసవరం ఉందన్నారు. దీనివల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలు తక్కువ పెట్టుబడితోనే విద్యుత్ సౌకర్యం పొందడంతోపాటు తిరిగి సోలార్ విద్యుత్‌ను డిస్కంవిక్రయించే స్థాయికి వస్తాయని అశోక్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

**సబ్సిడీ ఇలా...** పిఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పతకం కింద సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీ ఇస్తుంది. ఇందులో 1కిలోవాట్ వరకు 30వేలు, 2కిలో వాట్స్‌వరకు 60వేలు, 3కిలోవాట్స్‌నుంచి 10కిలోవాట్స్‌ల వరకు రూ.78వేలు రాయితీని ఇస్తుంది. ఉచిత సోలార్ విద్యుత్‌ను ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ కోసం కంపెనీలకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈసమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీహరి బాబు, ఉపాధ్యక్షులు రాజేష్ పరకాల, సంయుక్త కార్యదర్శులు బాబు నాయుడు, శ్రీనివాస్‌లతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సోలార్ ప్యానల్స్ ప్రతినిధుల హాజరయ్యారు.



**చేవెళ్ళ సభకు బయలుదేరుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**

## ఛలో చేవెళ్ళ సభకు కాంగ్రెస్ శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : చేవెళ్లలో జరిగే బహిరంగ సభకు మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డివిజన్ నుండి కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సభకు తరలివెళ్ళారు.

## డిప్యూటీ మేయర్‌ను కలిసిన మాణికేశ్వరీనగర్ బస్తీ కాంగ్రెస్ నాయకులు



**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు**

తార్నాక, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి దంపతులను మాణికేశ్వరీనగర్ బస్తీ కాంగ్రెస్ నాయకులు మంగళవారం తార్నాకలోని వారి కార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకం, విస్వాసంతో ఉన్న ప్రజలకు నాయకులకు ఎప్పుడు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమలో మాజీ వార్డు మెంబర్ లాజరస్, కాంగ్రెస్ నాయకులు ఎ.శ్రీనివాస్, నరసింహ్మా, ఎ.లింగయ్య, వెంకట్, వి.రవి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



**ఎస్వీ ఫంక్షన్ హాల్లో ద నెక్స్ పాఠశాల 6వ వార్షికోత్సవ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు**

## ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : విద్యార్థులను చిన్ననాటి నుంచే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యా యులపై ఉంటుందని కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. గాయిత్రినగర్‌లోని ద నెక్స్ పాఠశాల 6వ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఎస్వీ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహిం చా రు. ఈ వేడుకలకు అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, మేడ్చల్ ఎమ్ఈవో బి.ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటలతో చూపరులను ఆకట్టు కున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈవో జితేందర్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున్, కరస్పాండెంట్ లతతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బండారు రంగయ్య సేవలు చిరస్మరణీయం: వరప్రసాద్ గుప్తా

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : పేదల అభ్యున్నతికి నిస్వార్థ సేవలు అందించిన బండారు రంగయ్య గుప్తా సేవలు చిరస్మరణీయమని రంగానగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు టిఆర్ఎస్ నాయకులు వరప్రసాద్ కొనియాడారు. మంగళవారం బండారు రంగయ్యగుప్తా 13వ వర్ధంతిని పుర స్కరించుకుని హెచ్ఎంటి గోశాలలో సేవాకార్యక్రమాలను నిర్వహించి నోరులేని మూగజీవాలకు సహాయమందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలకాలంలో వృత్తి, ఉపాధి, ఉద్యోగ రంగాలలో ఎంతో సహాయ, సహకారాలను అందించిన స్వర్గీయ బండారు రంగయ్య పేదలపక్షపాతిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఇప్పటికీ ఆయన గుర్తుగా రంగానగర్ ప్రధానరహదారిపై చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి పాదచారుల దాహార్తితీరున్నారని గుర్తుచేశారు. రంగానగర్ కాలనీవాసులు స్వర్గీయ బండారు రంగయ్య చిత్రపటంవద్ద నివాళులు అర్పించి సంతాపం వ్యక్తంచేశారు.

## విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి : శ్రీగణేష్



**మహేంద్రహిల్స్‌లో బిజెపి విజయ సంకల్ప గోడపత్రికను ఆవిష్కరిస్తున్న శ్యామ్ సుందర్ గౌడ్,శ్రీగణేష్ తదితరులు**

కంటోన్మెంట్,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్ర మోడి దేశంలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 3వ సారి బిజెపి విజయాన్ని అకాంక్షిస్తుందని మహంకాలి జిల్లా బిజెపి అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్,కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి ఎన్.శ్రీగణేష్‌లు దీమా వ్యక్తం చేశారు. బిజెపి ఈ నెల 29న కంటోన్మెంట్‌లో బిజెపి తలపెట్టనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని విడుదల చేసిన గోడపత్రికను మంగళవారం మహేంద్రహిల్స్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిజెపి విజయ సంకల్ప యాత్రను కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని బిజెపి అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్,రాష్ట్ర నాయకుడు పరశరామ్, నాయకులు విజయానంద్, సతీష్, విజయ్ యాదవ్, వీరవర్ధన్ గౌడ్, అశోక్, రాజ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శం : తలసాని



**మారేడ్‌పల్లిలో కల్యాణ లక్ష్మిచెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని**

అడ్డగుట్ట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: పేద,మధ్య తరగతి ప్రజల కు చేయూతను అందించాలనే ఉద్యేశంతో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి షాదీముబారక్ కార్యక్రమాలను ప్రవేశపె ట్టిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో 37 మంది లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల ను తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కారో ్పరేటర్ మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్లు ఆకులరూప హరిక్రిష్ణ, అత్తెల్లి అరుణ గౌడ్, శేషుకుమారి పాల్గొన్నారు.

## తెలంగాణలోనే కొనసాగడం దీక్షా దక్షత నిదర్శనం



**సత్యనారాయణను సత్కరిస్తున్న టి.పద్మారావు, దళిత సంఘాల నేతలు**

**టి.పద్మారావు ప్రశంస**

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: హైదరాబాద్ సిటి పోలీస్ కమిష నరేట్‌లో అకౌంట్స్ ఆఫీసర్‌గా సేవలు అందించి వాలంటీరీ రిటైర్‌మెంట్ తీసుకుని ఎపిలో జరగబోయే ఎన్నికల్లో జనసేన తరపున పోటి చేస్తున్న జి.సత్యనారాయణను పలు దళిత సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు. మంగళవారం లక్డికాపూల్‌లోని ఆర్‌పిఐ కార్యాలయంలో సత్యనారాయణకు అభినందన సభ జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ముఖ్య సలహా దారు టి.పద్మారావు మాట్లాడుతూ సత్యనారాయణ ఎపికి చెందినవారైనప్పటికి ఉమ్మడి ఎపి విడిపోయినప్పటికి తెలంగాణ రాష్ట్రంలోనే విశేషమైన సేవలు అందించారన్నారు. అంబేద్కర్ వాదులైన దళిత నాయకులు కె.నాగయ్య, జి.బి.రాజు, కె.యాదగిరి, భూపతి, కె.విద్యాసాగర్ ఆయన ఆత్మీయ సంబంధాలు కొనసాగించారని పద్మారావు వివరించారు. సత్యనారాయణను సత్కరించిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్, కోశాధికారి ప్రమోద్, సీనియర్ నాయకులు మోహన్‌కృష్ణ, జోసెఫ్, పుణ్యభాను ప్రకాష్, కాంగ్రెస్ నేత ముజీబ్ తదితరులు ఉన్నారు.

## బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి



**అభివాదం చేస్తున్న వి.ఎల్.రాజు**

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఎంఆర్‌పిఎస్ చేస్తున్న అసత్య వాదన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా ఉండి మాలల కు వ్యతిరేకంగా అణిచివేసే కుట్రలకు పాల్పడుతున్న దోపిడీ రాజకీయ పార్టీలపై తిరుగుబాటు చేయకపోతే మాలల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వి.ఎల్.రాజు హెచ్చరించారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో విధంగా 59 కులాలకు చెందాల్సిన ఎస్సీ రిజర్వేషన్‌లను కేవలం మాదిగలకే 12 శాతం కేటాయించడానికి వర్గీకరణ చేయాలని, మిగిలిన 58 ఎస్సీ ఉప కులాలకు అన్యాయం, ద్రోహం చేయాలనే స్వార్థంతో కూడిని ఎంఆర్‌పిఎస్ వాదనను తిప్పికొట్టాలని ఆయన మాలలకు పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో జరిగిని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

## శ్రీపాదరావు జయంతిని ప్రభుత్వం అధికారపూర్వకంగా నిర్వహించడంపై హర్షం

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి మార్చి 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారపూర్వకంగా నిర్వహిస్తామని ప్రకటించడం పట్ల పలు బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘాల నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర క్యాబినేట్ మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తులసి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యదర్శి నందిరాజు లక్ష్మీ నారాయణ, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుద్దు సుబ్రహ్మణం, భాగ్యనగర్ బ్రాహ్మణ సోసైటి నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ప్రాంగణంలో శ్రీపాదరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## బోయిన్ చెరువు అక్రమార్కులు ఎంతటివారైనా వదిలిపెట్టేదిలేదు : బండి రమేష్



**అధికారులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న బండి రమేష్**

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువుల పునరుద్ధరణకు వాటి పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కటుట్బడి ఉందని, చెరవుల అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని హస్మాత్‌పేట్ బోయిన్ చెరువు పరి సరాలను ఆకస్మికంగా నియోజకవర్గ నాయకులతో కలిసి బండి రమేష్ సందర్శించారు. చెరువు చుట్టు బఫర్‌జోన్ (ఎఫ్‌టిఎల్) పరిధిలోని భూములును సుందరీకరణ పేరుతో అమ్ముకొని కోట్లాది రూపాయలను బిఆర్ఎస్ నాయకులు సంపాదించారని ఆరోపించారు. బోయిన్ చెరువు వాస్తవిక విస్తరణ ఎంత ఉందో, లేదో సర్వే ద్వారా తనకు నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరారావు, టిసిసి సెక్రటరీ యాదగిరి, డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున్‌యాదవ్, మహేష్ యాదవ్, ఏబ్లాక్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, కంటెస్టెడ్ కార్పోరేటర్ రఘు, కె.దినేష్‌కుమార్, శేరి సతీష్‌రెడ్డి, మధుగౌడ్, మేకల రమేష్, కుక్కల రమేష్, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**చేవెళ్లలో ఏర్పాటు చేసిన జనజాతర సభకు తరలి వెళ్లిన కోకాపేట్ మాజీ సర్పంచ్, పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి**

# అభివృద్ధే ధ్యేయంగా ముందుకు

**బడ్జెట్ సమావేశంలో చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ**



**సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం**

దుండిగల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పుర పాలిక సంఘం బడ్జెట్ సమావేశం మంగళ వారం చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ,5445.18లక్షల అంచనా ఆదాయం, రూ,5222.85లక్షల అంచనా వ్యయం రూ,222.33లక్షల మిగులుతో బడ్జెట్‌ను చైర్‌పర్సన్ ప్రవేశపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్, 2023-24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ మాట్లాడు తూ పురపాలిక అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, కౌన్సిల్ సభ్యుల సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నామన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితంగా పూర్తిచేసేందుకు కౌన్సిల్ సభ్యులతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాలకవర్గం సభ్యులు సమిష్టిగా ముందుకు సాగాలని తద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఆమోదం పొందిన 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్, 2023-24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ పారదర్శకంగా అందరికి ఆమోదయోగ్యంగా ఉండే విధంగా ఎంతో ఆదర్శవంతంగా తయారు చేసుకోవడం జరిగింది. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కమీషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ రావు, పిహెచ్‌సి డా.నిర్మల, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, అరుణ, క్రిష్ణయాదవ్, ఆనంద్‌కుమార్, రమాదేవి, రాముగౌడ్, సాయియాదవ్, మహేందర్‌యాదవ్, నవితారెడ్డి, నవనీత, సత్యనారాయణ, భరత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, బాలమణి, మౌనిక, వనిత, లక్ష్మీ, శంకర్‌నాయక్, వెంకటేష్, అనంతస్వామి, జోస్పిన్, ఏఈ ప్రవీణ్, ఆర్‌వో సునందా, మేనేజర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో వెన్నంటే ఉన్న వారికి అవకాశం కల్పించండి

**కాంగ్రెస్ అధిష్టానానికి డాకారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి**



**ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: కష్టకాలో పార్టీకి వెన్నంటి ఉన్న నేతలను గుర్తించి వచ్చే పార్లమెంట్ ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని సీనియర్ కాంగ్రెస్ నేత డాకారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ గత పదిసంవత్సరాల కాలంలో రాష్ట్రంలో తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసమయంలో అధికర దాహనంతో గద్దెనెక్కిన నేతలు అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేసినా పార్టీ సిద్ధాంతాల కోసం పోరాటం చేసిన కాంగ్రెస్ సైనికులకు అవకాశం కల్పించాలని కోరారు. గత 40 ఏళ్లుగా పార్టీబలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న తాను ఇటీవల మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి దరఖాస్తు చేశానని అధిష్టానం అవకాశం కల్పించాలని కోరారు.

## న్యూట్రిషియన్ ఫుడ్‌తో మానసిక ఆరోగ్యం

**లయన్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి**




**న్యూట్రిషియన్ ఫుడ్ అందచేస్తున్న లయన్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి**

ముషీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: న్యూట్రిషి యన్ ఫుడ్ తో పిల్లలు మానసిక ఆరోగ్యంగా ఉంటారని డిస్ట్రిక్ట్ రెండవ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మానసిక వికలాంగుల పాఠశాల అయిన భవిత సెంటర్ లో డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అడ్ పర్సనాలిటీకేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పళ్లు, గుడ్లు, న్యూట్రిషియన్ ఫుడ్, పుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. వైకల్యం ఉన్న పిల్లలు తరచూ అనేక ఇబ్బందులు పడుతున్నారని, తగినంత పోషకాహారం అందించటం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, స్థిరత్వం పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ అంజయ్య, లయన్ సి.హెచ్.గోపాలకృష్ణ, అధ్యక్షులు బెల్లంకొండ వినయ్, పి.స్వరూపారాణి, బి.వనిత, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, పాఠశాల హెచ్ఎం స్వరూపారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వాగ్ధానాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సే

**ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషాశ్రీ శ్రీకాంత్‌గౌడ్**



**సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళా నేతలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్ధానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషాశ్రీ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో 4 గ్యారంటీలు అమలు చేసిన సందర్భంగా మంగళవారం అంబర్ పేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ ఓర్వలేక మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పిసిసి ఖైరతాబాద్ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి అంబర్‌పేట అభివృద్ధికోసం 20కోట్ల రూపాయలు ప్రత్యేక నిధులు తీసుకువస్తే కొంతమంది ఓర్వలేక పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు దేవి, ప్రసన్న, ఆర్షియా, షహనాజ్, పారిజాత, సరిత పాల్గొన్నారు.

## 6 నుంచి 9 వరకు సంగమేశ్వరస్వామి ఉత్సవాలు

నాంపల్లి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి-శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మార్చి 6 బుధవారం నుండి 9 శనివారం వరకు శ్రీ సంగమేశ్వరస్వామి వారికి ఆలయ సంప్రదాయానుసారంగా మహా శివరాత్రి ఉత్సవాలు, పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ తెలియజేసింది. ఈ ఉత్సవాల్లో నిత్యహోమంతోపాటు మహన్యాసపూర్వక ఏకాదశ, ఏకవార, ఏకవార రుద్రాభిషేకాధి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరుపబడతాయని పేర్కొన్నారు. మార్చి 6 బుధవారం సాయంత్రం 5.30గంటల నుండి గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, మృత్సంగ్రహణం, అంకురారోపణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, కార్యక్రమాలు జరుగనున్నాయి.

# కోకాపేట్‌లో ఘనంగా జరిగిన సౌడమ్మ బోనాల వేడుకలు



**కోకాపేట్‌లో జరిగిన సౌడమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు**

నార్సింగి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : గండిపేట మండల పరిధిలోని కోకాపేట్‌లో మంగళవారం సౌడమ్మ అమ్మవారి బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. వందలాది మంది మహిళలు తలపై పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా ముస్తాబు చేసిన బోనాలాను పెట్టుకొని సౌడమ్మ మహిమలను తెలిపే భక్తిగీతాలాపన చేస్తూ తమ మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కోకాపేట మొత్తం సౌడమ్మ అమ్మవారి భక్తిగీతాలపానతో మారుమ్రోగింది. ఎటు చూసినా భక్తజన సందోహమే కనిపించింది. సౌడమ్మ అమ్మవారికి పీసీసీ ప్రతినిధి, మాజీ సర్పంచ్ ముంగి జైపాల్‌రెడ్డి, బిజెపి నార్సింగి మున్సిపల్ అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్, వివిధ పార్టీల నాయకులు ఓంప్రకాశ్‌రెడ్డి, హరిశంకర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిమాన్విత సౌడమ్మ అమ్మవారికి ఏటేటా భక్తజనం పెరుగుతూనే ఉన్నారన్నారు. కొలిచిన వారికి కొంగు బంగారంగా ఉంటూ, భక్తుల కోరికలు తీరుస్తుండడం వల్లనే భక్తజనులు పెరుగుతున్నారన్నారు. కోకాపేట గ్రామానికి చెందిన ప్రజలకు భక్తి,శ్రద్ధలతో అమ్మవారికి బోనం ఎక్కించి, ముడుపులు చెల్లించుకున్నారు. సౌడమ్మ శతాబ్దాలుగా మా గ్రామ ప్రజలను ఆపదలు, అనారోగ్యం నుంచి కాపాడుతూ వస్తున్నారని తెలిపారు. వందలాది మంది భక్తజనం పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలి : కెటిఆర్



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తదితరులు

**తుర్కయాంజాల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు 420 హామీలు ఇచ్చి ఇపుడు మాట తప్పుతోందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మన్నెగూడ వేద కన్వెన్షన్ హాల్లో పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ నియోజక వర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు... ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి వంద రోజులు కావస్తున్నా వాటిని అమలు చేసే దిక్కే లేదని ధ్వజమెత్తారు. మార్చి 17తో వంద రోజులు పూర్తి అవుతాయని, అధికారంలోకి వచ్చి ఒక నోటిఫికేషన్ వేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ ఉద్యోగాలను భర్తీ చేస్తూ ఆ ఉద్యోగాలన్ని తామే ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతుబంధు కోసం రైతులు ముఖాలు చూసుకునే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కరెంట్ కోతలు, తాగునీటి బాధలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలు, రైతులు తప్పు చేశామన్న భావనను బహిరంగంగా వ్యక్తపరుస్తున్నారని అన్నారు. కృష్ణా జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించని బీజేపీ, కాంగ్రెస్‌లకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక అర్హత లేదన్నారు. కోటి 24 లక్షల గ్యాస్ కనెక్షన్లు రాయితీ కల్పించాలని, కోటి 5 లక్షల మీటర్ల కనెక్షన్లు ఉన్న ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. అప్పుడేమో ఫ్రీ కరెంట్ అన్నారని, ఇప్పుడేమో కొందరికే అంటున్నారని ఎద్దేవా చేశారు. మహిళలకు చేయూత పథకం కింద రూ.2500 రూపాయలు ఇవ్వాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేద్దామని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని ఉద్యమకారులు కేటీఆర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కాలె యాదయ్య, ఆర్కేపురం గాంధీ, ఎమ్మెల్సీ యెగ్గం మల్లేశం, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, దండెం రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి, ఎంపీపీలు పి.కృపేష్, నర్మదా, యాచారం జెడ్పీటీసీ చిన్నోల్ల జంగమ్మ యాదయ్య, మాజీ చైర్మన్ భరత్ కుమార్, అశ్విని, జెర్కోని రాజు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలకు కల్పనకు నిధులు మంజూరు చేయాలి : కార్పొరేటర్ సునీత



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ సునీత తదితరులు

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** గౌతమ్‌నగర్ డివిజన్‌లోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు సిసి రోడ్లు డ్రైనేజీ ఇతర సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారంగౌతమ్‌నగర్‌డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ కు నిధులు మంజూరుచేయాలని ఫోన్ ద్వారా ఆదేశం చినట్లు కార్పొరేటర్ సునీత యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

## వీరన్నగుట్టలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి : నర్సింహ్మారెడ్డి



వీరన్నగుట్ట వద్ద ఏర్పాట్లను సమీక్షిస్తున్న కార్పొరేటర్ నర్సింహ్మారెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వీరన్నగుట్టలో వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేయాలని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్‌పరిధి హయత్‌నగర్ ప్రాంతంలోని ప్రాచీనమైన వీరన్నగుట్టను మంగళవారం హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ యాదయ్య, జీహెచ్ఎంసీ లైట్స్ డీఈఈ పున్నానాయక్, సమీప కాలనీల సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీరన్నగుట్ట చుట్టూ ఉన్న ఆలయభూములను రక్షించాలని, కబ్జాలకు గురైన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. దేవాదాయ శాఖ చారిత్రక ఆలయానికి అవసరమైన మేర నిధులను కేటాయించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశముందని ఈ నేపథ్యంలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించాలన్నారు. స్వాతిరెసిడెన్సీ వైపు మెట్లదారి నుంచి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రహరీని తొలగించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ లావణ్య, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి పార్లమెంట్ సీటును తనకు కేటాయించాలి : పోల్కం శ్రీనివాస్



దీపా మున్షికి పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న శ్రీనివాస్

**మలక్‌పేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ నుండి మల్కాజిగిరి పార్లమెంట్ సీటును తనకు కేటాయించాలని టిపిసిసి ఒబిసి సెల్ సీనియర్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరానికి విచ్చేసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలఇంచార్జి దీపాదాస్‌మున్షీని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి మల్కాజిగిరి పార్లమెంట్ సీటును తనకు కేటాయించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరు కులస్తులకు ఎమ్మెల్సీలుగా, రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. అదే విధంగా త్వరలో నియమించనున్న నామినేటెడ్ పోస్టులలో మేరకు కులస్తులకు ఛైర్మన్ పదవులు, డైరెక్టర్లుగా నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేరు యువజన సంఘంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, గంగాపురం దశరథ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : అబ్రార్



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** డివిజన్ మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని అజంపుర డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని ఫర్హత్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టడడానికి అధికారులతో కలిసి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డితో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి

**ఉప్పల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డిని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ మేరకు జలమండలి ఎండితో నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మంచినీటి పైప్‌లైన్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని విన్నవించారు. వచ్చే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి డివిజన్‌కు రూ.కోటి విలువైన పనులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, సాయిజెన్‌శేఖర్, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తేవడానికి అందరూ కలిసి రావాలి: తీగల కృష్ణారెడ్డి



రవీంద్రచారికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వైభవం తీసుకురావడానికి అందరూ కలిసి రావాలని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ క్యాంపు కార్యాలయంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు వజ్రోజు రవీంద్రచారి పార్టీకి రాజీనామా చేసి టికెఆర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా తిరుమలహిల్స్ కు చెందిన నర్సింహా అనే నాయకుడు కూడా కాంగ్రెస్‌లో చేరాడు. అనంతరం తీగల మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను శక్తివంతమైన పార్టీగా తయారు చేయడానికి కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులైన మీర్‌పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు జటావత్ రవినాయక్, గండికోట అంజయ్య, చిన్న పాండు తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యం వెదజల్లే రెడిమిక్స్, బ్రిక్స్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా కాలనీకి సమీపంలో ఏర్పాటుచేసిన రెడిమిక్స్ ప్లాంటు, బ్రిక్స్ మ్యానిఫ్యాక్చర్ ప్లాంటుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామం వెంకటేశ్వర కాలనీవాసులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీకి సమీపంలో ఏర్పాటు చేసిన తిరుమల రెడిమిక్స్ నుంచి వస్తున్న దుమ్ము, దూళితో వాయుకాలుష్యానికి తోడు శబ్ధ కాలుష్యం కూడా ఎక్కువగా ఉంటోందన్నారు. నిబంధనలు పాటించకుండా ప్లాంట్లను కొనసాగిస్తుండడంతో సమీప కాలనీలోని ఇళ్లల్లో దుమ్ము, దూళి చేరి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి కాలనీవాసుల ఇబ్బందులను పరిశీలించి సదరు ప్లాంట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కోదండరాంను కలిసిన ఆర్ఎంపి, పిఎంపీలు




ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన వైద్యులు

**కుషాయిగూడ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించాలని ఆర్.ఎం.పి పిఎంపి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పబ్బా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆర్ఎంపి పి.ఎం.పి డాక్టర్ల సంఘం సోమవారం ప్రొఫెసర్ కోదండరాం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వైయస్సార్ జీవో ఎంఎస్ నెం. 429 జారీ చేసి ఆర్.ఎం.పి, పి.ఎం.పిలకు పారామెడికల్ సర్వీసెస్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రైనింగ్‌కాలం పూర్తి కాకముందే డాక్టర్ వైయస్సార్ హఠాన్మరణం చెందారు. ఆయన తదనంతరం వచ్చిన ముఖ్యమంత్రులు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంతో మధ్యంతరంగా పారామెడికల్ సర్వీసెస్ ట్రైనింగ్ కార్ కార్యక్రమం ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తూతూ మంత్రంగా జీవో ఎంఎస్ నెం: 428 జారీ చేసి నిధులు కేటాయించలేదు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ఆర్.ఎం.పి, పి.ఎం.పీల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఎలక్షన్ మేనిఫెస్టోలో పొందపరిచిన విధంగా పార్లమెంటరీ సర్వీసెస్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆర్ఎంపి, పిఎంపిలను ఆదుకోవాలని వినతి పత్రం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా కోదండరాం సానుకూలంగా స్పందించారు, గ్రామీణ ప్రాంతాలలో నామ మాత్రపు ఫీజు తీసుకొని ఆర్ఎంపీలు పీఎంపీలు చేసే సేవలు అభినందనీయమన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్.ఎం.పి, పీ.ఎం.పి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యానిర్వహణ అధ్యక్షుడు పబ్బా చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణం, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి మల్లేశం, పల్లెపాటి శ్రీనివాస్, ఘట్కేసర్ మండలం అధ్యక్షుడు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో మహిళలకు పెద్ద పీట: జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



జడ్పీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డిని కలిసిన మహిళలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పాలనలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని రంగారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా అనితారెడ్డిని మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ఆర్ఎన్‌రెడ్డి నగర్ పరిసర కాలనీలకు చెందిన మహిళలు స్థానిక మహిళా కాంగ్రెస్ నాయకురాలు పద్మారెడ్డి ఆధ్వర్యంలో కలిసారు. ఈ సందర్భంగా వారు అనితారెడ్డి పార్టీలో చేరడాన్ని స్వాగతించి సంఘీ భావం తెలిపారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం అనితారెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ద్వారా కామాయి, మధురానగర్ కాలనీలకు చెందిన శిరీష, శ్వేత, దివ్య, శిరీష, యాదమ్మ, పద్మ, లావణ్య, దివ్య తదితరులతో పాటు మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు గొరిగె అయిలమ్మ, కాట్నే పద్మశ్రీ యాదవ్, ఎర్రబెల్లి అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

## నాచారం పెద్దనాలా పూడిక తీత పనులు పరిశీలన : కార్పొరేటర్ శాంతిశేఖర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** నాచారం పెద్దనాలా పూడిక తీత పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షపు నీరు, డ్రైనేజీ నీటి సమస్య లేకుండా ఇప్పటికే డివిజన్‌లో ఐదు కొత్త బ్రిడ్జిలను నిర్మించడం జరిగిందన్నారు. ఇంకా మరో రెండు బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. తొలగించిన పూడిక తీతను వెంటనే అక్కడి నుంచి తరలించాలని అధికారులకు ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ రూప వర్క్‌ఇన్స్‌పెక్టర్ విజయ్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు శాయిజన్ శేఖర్ పాల్గొన్నారు.

## బదిరుల సంక్షేమానికి కృషి : దేవి ప్రసాద్



దేవి ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న నిర్వాహకులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** బధిరుల సంక్షేమానికి కృషి చేస్తామని మాజీ ఛైర్మన్ దేవిప్రసాద్ పేర్కొన్నారు. మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమ పాఠశాల (ఫిన్) 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బధిరుల కోసం పాఠశాలను ఏర్పాటు చేసి నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందనీయమని నిర్వాహకులను అభినందించనంచారు. బధిరుల పాఠశాలకు శాశ్వత గృహాన్ని ఇప్పించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. సంస్థ అధ్యక్షురాలు జానకి మాట్లాడుతూ మాట వినికిడి లోపంగల విద్యార్థులకు వైద్య, విద్య, ఉపాధి రంగాల్లో రాణించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, రాజు, బాబుజాన్, వేణుగోపాల్, శ్రీనిఆసులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఫణిగిరి కాలనీ హనుమత్ ప్రత్యంగిరా వారాహి యజ్ఞస్థలిలో త్రిశక్తి దేవస్థాన శంకుస్థాపన

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని హనుమత్ ప్రత్యంగిరా వారాహి యజ్ఞస్థలిలో త్రిశక్తి దేవస్థాన శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయం నిర్వాహకులు డాక్టర్ గుండెపూడి శివసుధీర్‌శర్మ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి శ్రీ జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారు హాజరై త్రిశక్తి దేవస్థాన శంకుస్థాపన మహోత్సవాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుధీర్ శర్మ విజ్ఞప్తి చేశారు.

## వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ : కార్పొరేటర్ కక్కిరేణి చేతన

**ఉప్పల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** వృద్ధులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు చేయూత అందించాలని హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో పెవికాల్ ఛాంపియన్‌షిప్ క్లబ్ అధ్యక్షుడు చెల్లోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో రాంశంకరనగర్‌లోని మమత వృధాశ్రమంలో టివి అందజేశారు. అనంతరం నిత్యావసరకులను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ చేతన మాట్లాడుతూ పెవికాల్ సంస్థ పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెవికాల్ కంపెనీ రీజనల్ మేనేజర్ అజయ్‌ఠాకూర్, ఇంచార్జీ పిరోజ్, అర్జున్, వృధాశ్రమం నిర్వహకులు భారతి కమలాకర్, క్లబ్ సభ్యులు మారేపు రవి, కనకాచారి, విశ్వనాధుల రామకృష్ణ, నరసింహాచారి, ధనుంజయ్, సతీష్, వేణుచారి, బాలు, లింగం తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆపిల్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్ నూతన కమిటి సభ్యులు (ప్రభాతవార్త, తుర్కయాంజాల్)

## సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :** ఉప్పల్ లక్ష్మారెడ్డికాలనీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ లక్ష్మారెడ్డికాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన గెలుపు కోసం కాలనీవాసులు ఎంతో కృషి చేశారని, కాలనీ అభివృద్ధి కోసం తన వంతు కృషిచేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని, కాలనీలో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరెడ్డి, కార్యదర్శి ప్రేమ్‌సాగర్‌రెడ్డి, గోనె అర్జున్‌రెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, మేకల వెంకట్‌రెడ్డి, దయాసాగర్‌రెడ్డి, అంజిరెడ్డి, బాబులాల్, గోనె ప్రభాకర్‌రెడ్డి, పి.జితేందర్‌రెడ్డి, బింగి భరత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నూతన పైప్ లైన్లను నిర్మించండి : పవన్



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** దశాబ్దాల క్రితం నాటి పైప్ లైన్ల వల్ల స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నూతన పైప్ లైన్ నిర్మాణం పనులను ఏర్పాటు చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్ సత్యా నగర్ కాలనీలో మంగళవారం కార్పొరేటర్ పర్యటించగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు. చాలా రోజులుగా మంచినీటిలో డ్రైనేజీ మురుగునీరు కలుస్తోందని దీంతో తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే జలమండలి జనరల్ మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పురాతన పైప్ లైన్ల కారణంగా డివిజన్‌లోని కాలనీవాసులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారని మంచినీరు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని అధికారులు వెంటనే పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్య నగర్ కాలనీ సంక్షేమ సంఘం సెక్రటరీ రమణ, శివరాజ్ పాటిల్, నాయకులు కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ క్రికెట్ టోర్నీలో కెఎస్ఎం జట్టు విజయం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ఎల్‌బి స్టేడియంలో జరిగిన సేవాలాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో అల్మాస్‌గూడకుచెందిన కెఎస్ఎం క్రికెట్ జట్టు విజయం సాధించి లక్ష రూపాయల నగదు బహుమతిని గెలుచుకుంది. సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ టోర్నీలో పాల్గొనడానికి కెఎస్ఎం జట్టుకు అల్మాస్‌గూడ శ్రీహిల్స్ కు చెందిన గిరిజన విద్యార్థి నాయకుడు బహుగుణ నాయక్ స్పాన్సర్ చేసి సహకరించారు. అయితే పోటీల్లో ట్రోఫీని, రూ.లక్ష నగదును దక్కించుకున్న కెఎస్ఎం జట్టు బహుగుణకు కృతజ్ఞతలు తెలిపింది.

## ఐవిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు : ఉప్పల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ వైస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు మార్చి 4వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఐబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం నాగోల్‌లోనే ఉప్పల నివాసంలో కరపత్రాలను శ్రీనివాస్ గుప్త ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు పలు రకాల పోటీలను నిర్వహిస్తున్నామని ఈ పోటీలకు మంత్రి సీతక్క, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి లను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తామని తెలిపారు.

**ఐవిఎఫ్ నూతన కమిటీ నియామకం...** రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఐవీఎఫ్ నూతన కమిటీలను ఉప్పల శ్రీనివాస్ గుప్తా నియమించి వారికి నియామక పత్రాలను అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలుగా జాహ్నవి, హైదరాబాద్ అధ్యక్షురాలుగా చంద్రకళ, కార్యదర్శిగా జ్యోతి, వనస్తలిపురం అధ్యక్షురాలుగా సవిత, సెక్రటరీగా భవాని, ఆర్కేపురం అధ్యక్షురాలుగా కె.అరుణ, కార్యదర్శిగా టి.గీత నియామకమయ్యారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్, మహిళా విభాగం జనరల్ సెక్రటరీ మంజుల, ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, నరేష్ గుప్తా, కటకం శ్రీనివాస్, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ చింతల రజినీకాంత్, బువనగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డి వల్లే మహేశ్వరం బిఆర్ఎస్‌కు కంచుకోట : మైనారిటీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న హామెద్, షాకీర్, రవూఫ్, అంజాద్‌ఖాన్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** సబితా ఇంద్రారెడ్డి వల్లే మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా మారిందనీ పార్టీని ఎవరు వీడినా ఏ మాత్రం ప్రభావం ఉండదని జల్‌పల్లి మున్సిపాలిటీ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామెద్, అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్, సీనియర్ మైనారిటీ నాయకులు మీర్జా షాకీర్ బేగ్, మహ్మద్ అంజాద్‌ఖాన్‌లు స్పష్టం చేశారు. మంగళవారం ఎర్రకుంటలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జడ్పీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డిలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరినా బిఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం ఉండదన్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డి రోజుకు పదహారు గంటలు పని చేసి మహేశ్వరం నియోజకవర్గంలో బిఆర్ఎస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేశారని అన్నారు. ఆమె చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గతంలో ఎవ్వరూ చేయలేదని వారు వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో సైతం మహేశ్వరంలో బిఆర్ఎస్‌కు మెజార్టీ వస్తుందని వారు స్పష్టం చేశారు.